RNI No.APTEL/26/A5538

న్యూస్ 100

ఎడిటర్ : జాజుల సత్తిబాబు | బుధవారం | పేజీలు : 5 | వార్త పత్రిక

సంపుటి : 01, సంచిక : 115 | నవంబర్ 18, 2026 | వెల : రూ.4-00



- నిర్మలా సీతారామన్‌కు చంద్రబాబు విజ్ఞప్తి
- కేంద్ర ఆర్థిక మంత్రితో ముఖ్యమంత్రి భేటీ
- తుపానులు, ఎల్‌నినోతో జరిగిన నష్టాన్ని వివరించిన సీఎం
- నష్ట అంచనాల నివేదికల ఆధారంగా సాయం కోరిన చంద్రబాబు



రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సాయం అందించండి

న్యూఢిల్లీ, న్యూస్100 : ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రాయలసీమను ఉద్యానవన పంటల కేంద్రంగా అభివృద్ధి చేసే హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టు ప్రతిపాదనలను అమలు చేసేందుకు నిర్ణయం తీసుకోవాలని కోరారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టు రాష్ట్ర వ్యవసాయ రంగానికి కీలకమని చంద్రబాబు వివరించినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనకు సంబంధించిన అంశాలను పరిశీలించి, అమలుకు అవసరమైన నిర్ణయాలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన ఇతర ముఖ్యమైన అంశాలపైనా ఇరువురు చర్చించారు. ఇటీవల రాష్ట్రాన్ని ప్రభావితం చేసిన అర్నబ్, మురసు తుపానులతో పాటు ఎల్‌నినో ప్రభావం కారణంగా జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి వివరించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల వివిధ ప్రాంతాల్లో ఎదురైన నష్టంతో రాష్ట్రంపై ఆర్థిక భారం పడిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. తుపానుల కారణంగా జరిగిన నష్టానికి సంబంధించిన అంచనాలు, వివరాలతో కూడిన నివేదికలను ఇప్పటికే కేంద్రానికి పంపినట్లు చంద్రబాబు గుర్తు చేశారు. ఆ నివేదికలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సహాయం అందించాలని నిర్మలా సీతారామన్‌ను కోరారు. నష్టాల నుంచి రాష్ట్రం కోలుకునేందుకు కేంద్ర సహకారం అవసరమని వివరించారు. కేంద్ర ఆర్థిక మంత్రితో అధికారిక సమావేశం ముగిసిన అనంతరం చంద్రబాబు ఢిల్లీలో ప్రముఖ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా నివాసంలో జరిగే శుభకార్యానికి హాజరుకానున్నారు. కార్యక్రమం పూర్తయ్యాక రాత్రికి అమరావతికి తిరుగు ప్రయాణం కానున్నట్లు సమాచారం.

అక్వాన్ తుఫాన్ దిశలో మార్పు

- కోనసీమ తీరానికి ముప్పు పొంచి ఉందన్న అంచనా
- కోనసీమ సమీపంలో తీరం దాటే అవకాశం
- కాకినాడ, మచిలీపట్నం మధ్య తీరప్రాంతంపై ప్రభావం
- కోరంగి, ఉప్పాడ ప్రాంతాలపై ఉప్పెన ఆందోళన

2లో..

- తుఫాన్ కదలికలపై తాజా అంచనాలతో అప్రమత్తత అవసరం



ఇంజినీరింగ్ కనీస ఫీజు రూ.47 వేలకు పెంపు


- రూ.40 వేల నుంచి రూ.47 వేలకు సవరణ
- రెండు నెలల్లో కొత్త ఫీజుల విధానం ఖరారు
- రీయింబర్స్‌మెంట్ నిధులు పెంచాలని అపెక్మా విజ్ఞప్తి



అమరావతి, న్యూస్100 : ఆంధ్రప్రదేశ్‌లోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల కనీస వార్షిక ఫీజును ప్రభుత్వం పెంచింది. ఇప్పటివరకు రూ.40 వేలుగా ఉన్న కనీస ఫీజును రూ.47 వేలకు సవరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ తాత్కాలిక ఫీజు పెంపును ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాల సంఘం (అపెక్మా) స్వాగతించింది. కళాశాలల పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఫీజు పెంచినందుకు కూటమి ప్రభుత్వానికి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపింది. రెండు నెలల్లో పూర్తిస్థాయి ఫీజుల ఖరారు 202629 కొత్త బ్లాక్ పీరియడ్‌కు సంబంధించిన పూర్తిస్థాయి ఫీజుల వివరాలను రానున్న రెండు నెలల్లో ప్రభుత్వం ఖరారు చేయనుందని అపెక్మా వెల్లడించింది. ప్రస్తుతానికి కనీస ఫీజును రూ.47 వేలకు పెంచడం కళాశాలలకు కొంత ఊరటనిస్తుందని యాజమాన్యాలు అభిప్రాయపడ్డాయి. కొత్త ఫీజుల ఖరారులో కళాశాలల నిర్వహణ వ్యయాలు, ఇతర పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని కోరాయి. రీయింబర్స్‌మెంట్ నిధులు పెంచాలి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులపైనా అపెక్మా వివరాలు మిగతా 2వ పేజీలో..

అక్వాన్ తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

- ఈ నెల 20న నెల్లూరుతుని మధ్య తీరం దాటే అవకాశం
- తీర ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి
- రైతులకు అండగా నిలవాలి.. అధికారులకు పవన్ కల్యాణ్ ఆదేశం



అమరావతి, న్యూస్100 : రాష్ట్రంపై అక్వాన్ తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు రక్షణ చర్యలను ముమ్మరం చేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా విభాగాల అధికారులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన పలు సూచనలు చేశారు. నెల్లూరుతుని మధ్య తీరం దాటే అవకాశం వాతావరణ శాఖ తాజా నివేదికల ప్రకారం అక్వాన్ తుపాను ఈ నెల 20న నెల్లూరు నుంచి తుని మధ్య తీరం దాటే అవకాశం ఉందని అధికారులు వివరించారు. తీరం దాటే సమయంలో గంటకు 120 నుంచి 145 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే ప్రమాదం ఉందని తెలిపారు. నవంబరు 19, 20 తేదీల్లో మిగతా 2వ పేజీలో..

సజ్జల, పెద్దిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి



సాక్షి కథనంపై వైఎస్ షర్మిల తీవ్ర అభ్యంతరం

- తన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపణ
- కుమార్తె వివాహానికి సీఎంను ఆహ్వానించడంలో రాజకీయ కోణం లేదని స్పష్టీకరణ
- వైఎస్సార్ గతంలోనూ చంద్రబాబును వివాహాలకు ఆహ్వానించారని గుర్తుచేసిన షర్మిల
- జగన్, సాక్షి యాజమాన్యం సమాధానం చెప్పాలని డిమాండ్

2లో..

జగన్‌ను కలిసిన మాజీ మంత్రి రోజా


- పుట్టినరోజు సందర్భంగా వైసీపీ అధినేత ఆశీస్సులు
- ఆప్యాయత చూపిన జగన్‌కు రోజా కృతజ్ఞతలు
- భేటీ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న మాజీ మంత్రి

2లో..

వేంపల్లెలో టీడీపీ నాయకుడి కారుకు నిప్పు

- గండి రోడ్డుపై వాహనాన్ని అడ్డగించిన గుర్తుతెలియని వ్యక్తులు
- చెన్నరాయుడు చూస్తుండగానే కారుకు నిప్పంటించి పరారీ
- ఘటనా స్థలంలో బీరు సీసాలు, చెప్పులు స్వాధీనం
- పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ ఉద్రిక్తత

2లో..





న్యూస్100

బుధవారం నవంబర్ 18 , 2026

ఏలేశ్వరం ఇరిగేషన్ కార్యాలయంలో ప్రభుత్వ విద్యుత్ దుర్వినియోగం





ఏలేశ్వరం, న్యూస్100: ఏలేశ్వరం ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ కార్యాలయంలో ప్రభుత్వ విద్యుత్‌ను వ్యక్తిగత అవసరాలకు వాడుకుంటున్నారన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి ప్రతిరోజూ ఆఫీసుకు వచ్చే తన స్కూటీని కార్యాలయంలోని ప్రభుత్వ విద్యుత్‌తోనే ఛార్జింగ్ పెట్టుకుంటున్నారని స్థానికులు, కొంతమంది ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఉదయం ఆఫీసుకు రాగానే స్కూటీని ఛార్జింగ్‌కు పెట్టి, సాయంత్రం వరకు ఛార్జింగ్ చేసుకుని తీసుకెళ్తున్నారని వారు చెబుతున్నారు.ప్రభుత్వ కార్యాలయంలోని విద్యుత్ కేవలం కార్యాలయ పనులు, కంప్యూటర్లు, లైట్లు, ఫ్యాన్లు వంటి అధికారిక అవసరాలకు మాత్రమే వినియోగించాలి. వ్యక్తిగత వాహనాల ఛార్జింగ్‌కు వాడటం నిబంధనలకు విరుద్ధమని, ఇది ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం కిందకు వస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఒక ఉద్యోగి రోజూ ఇలా చేస్తుంటే నెలకు ఎంత విద్యుత్ వృథా అవుతుందో దాని భారం ప్రభుత్వంపై పడుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఇదే తరహాలో మిగిలిన వారు కూడా చేస్తే పరిస్థితి ఏమిటని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి,నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని,ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని కార్యాలయాల్లో ఆదేశాలు జారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అక్వాన్ తుఫాన్ దిశలో మార్పు

అమరావతి, న్యూస్100 : బంగాళాఖాతంలో కొనసాగుతున్న అక్వాన్ తుఫాన్ కదలికలపై భారత వాతావరణ శాఖ తాజా అంచనాలను వెల్లడించింది. తుఫాన్ ఉత్తర వాయువ్య దిశగా కదులుతూ ఈ నెల 19వ తేదీ ఉదయానికి అతి తీవ్ర తుఫాన్‌గా బలపడే అవకాశం ఉందని తెలిపింది. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం సమయంలో నెల్లూరు నుంచి విశాఖపట్నం మధ్య ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటవచ్చని తాజా ప్రకటనలో పేర్కొంది. కోనసీమ సమీపంలోనే తుఫాన్ తీరం దాటుతుందనే విషయాన్ని మాత్రం అధికారికంగా నిర్ధారించలేదు. మంగళవారం ఉదయం 11.30 గంటల సమయానికి తుఫాన్ చెన్నైకి తూర్పున 600 కిలోమీటర్లు, మచిలీపట్నానికి ఆగ్నేయంగా 650 కిలోమీటర్లు, విశాఖపట్నానికి దక్షిణ ఆగ్నేయంగా 660 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. తీరం దాటే సమయంలో గంటకు 120 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, అప్పుడప్పుడు 145 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అంచనా వేసింది. కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాలకు తుఫాన్ ప్రభావంతో ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తీరం దాటే సమయంలో సముద్ర మట్టానికి అదనంగా ఒకటి నుంచి రెండు మీటర్ల ఎత్తు వరకు అలల ఉద్ధృతి పెరిగి లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ నెల 20వ తేదీ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కాకినాడ, పశ్చిమ గోదావరి ప్రాంతాల్లో అలల ఉద్ధృతి ఎక్కువగా ఉండవచ్చని పేర్కొంది. కోరంగి, ఉప్పాడ వంటి తీర ప్రాంతాల ప్రజలు కూడా అధికారుల సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. తుఫాన్ ప్రభావంతో ఈ నెల 19, 20 తేదీల్లో కోస్తాంధ్రలో పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు, అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానాం తీరాల వెంబడి సముద్రం ఈ నెల 19వ తేదీ సాయంత్రం నుంచి 20వ తేదీ తుఫాన్ తీరం దాటే వరకు అత్యంత అల్లకల్లోలంగా మారవచ్చని హెచ్చరించింది.

సాక్షి కథనంపై వైఎస్ షర్మిల తీవ్ర అభ్యంతరం

అమరావతి, న్యూస్100 : ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివాహ ఆహ్వాన పత్రిక అందజేయడంపై సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనాన్ని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా ఖండించారు. ఆ కథనం తన వ్యక్తిత్వాన్ని, కుటుంబ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని ఆరోపించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదికగా సుదీర్ఘ ప్రకటన విడుదల చేస్తూ తన అభ్యంతరాలను వెల్లడించారు. తన కుమార్తె వివాహానికి రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆహ్వానించడాన్ని వక్రంగా చిత్రీకరించడం సరికాదని షర్మిల పేర్కొన్నారు. శుభకార్యానికి ఆహ్వానించడం సాధారణమైన ఆత్మీయతలో భాగమని, దానికి రాజకీయ సంబంధాలు అంటగట్టడం అనుచితమని విమర్శించారు. తండ్రి వయసున్న వ్యక్తికి వివాహ ఆహ్వాన పత్రిక అందిస్తే చెట్టాపట్టాలంటూ వ్యాఖ్యానించడం మహిళా గౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా తన పిల్లల వివాహాలకు చంద్రబాబును ఆహ్వానించారని షర్మిల గుర్తుచేశారు. వివాహ వేడుకలకు ఆహ్వానించడం, హాజరై ఆశీర్వదించడం రాజకీయ సాన్నిహిత్యానికి నిదర్శనమవుతుందా అని ప్రశ్నించారు. వ్యక్తిగత, కుటుంబ సంబంధాలను రాజకీయ కోణంలో చూడటం తగదని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి కూడా షర్మిల పలు ప్రశ్నలు సంధించారు. మహిళల పట్ల గౌరవం గురించి మాట్లాడే నాయకత్వం, తమ పార్టీకి చెందిన పత్రికలో ప్రచురితమైన కథనంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక మహిళపై వ్యక్తిత్వ హననం చేసేలా కథనాలు రాయడం ఆమోదయోగ్యమేనా అని ప్రశ్నించారు. తనపై వచ్చిన కథనానికి జగన్ సమాధానం చెప్పాలా, లేక సాక్షి దినపత్రిక వివరణ ఇవ్వాలా అన్నది తేల్చుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు. తప్పుడు ప్రచారాలకు బాధ్యత వహించాలని, మహిళలపై వ్యక్తిగత ఆరోపణలు చేసే ధోరణికి ముగింపు పలకాలని కోరారు. ఈ అంశంపై ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి.

వేంపల్లెలో టీడీపీ నాయకుడి కారుకు నిప్పు

పులివెందుల, న్యూస్100 : వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లె మండలంలో సోమవారం అర్ధరాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇడుపులపాయకు చెందిన టీడీపీ నాయకుడు పి.పి. చెన్నరాయుడు ప్రయాణిస్తున్న ఎస్‌యూవీ వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అడ్డగించి నిప్పంటించారు. పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఈ ఘటన జరగడంతో స్థానికంగా కలకలం రేగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి చెన్నరాయుడు వేంపల్లె మండలంలోని గండి రోడ్డు మీదుగా వాహనంలో వెళుతుండగా కొందరు వ్యక్తులు అడ్డుకున్నారు. అనంతరం ఆయన కళ్లముందే కారుకు నిప్పంటించి అక్కడి నుంచి పారిపోయారు. సమాచారం అందుకున్న డీఎస్పీ మురళీ నాయక్ నేతృత్వంలోని పోలీసు బృందం వెంటనే ఘటనా స్థలానికి చేరుకుంది. మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. వారు మంటలను ఆర్పివేయడంతో వాహనం పూర్తిగా దగ్ధం కాకుండా చర్యలు చేపట్టారు. ఘటన జరిగిన ప్రాంతంలో ఖాళీ బీరు సీసాలు, చెప్పులను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ వస్తువులు దర్యాప్తులో కీలక ఆధారాలుగా మారే అవకాశం ఉంది. పంచాయతీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు, నాయకులను భయపెట్టేందుకే ప్రత్యర్థులు ఈ దాడికి పాల్పడ్డారని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. రెండు రోజుల క్రితం టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి ఈ ప్రాంతంలో పర్యటించి సర్పంచ్ అభ్యర్థిగా ఎస్. గౌస్ పేరును ప్రకటించారు. ఐదు దశాబ్దాల తర్వాత ఈ స్థానంలో మైనారిటీ నాయకుడిని బరిలోకి దింపుతున్నామని, విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గతంలోనూ వేంపల్లె మండలంలో రాజకీయ ఘర్షణలు చోటుచేసుకున్న నేపథ్యంలో తాజా ఘటనపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కేసు నమోదు చేసి వాహనానికి నిప్పంటించిన వ్యక్తుల గుర్తింపునకు దర్యాప్తు చేపట్టారు. ఘటన వెనుక రాజకీయ కారణాలున్నాయన్న ఆరోపణలను పరిశీలించాల్సి ఉంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రాంతంలో పోలీసు పర్యవేక్షణ కొనసాగుతోంది.

గోకవరంలో భారీగా తెదేపాలో చేరిన యువత...

- యువ నాయకుడు మండే గౌతమ్ ఆధ్వర్యంలో చేరికలు..
- తెదేపా కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే నెహ్రూ...





గోకవరం న్యూస్100 : గోపవరం గ్రామంలో స్థానిక డ్రైవర్స్ కాలనీకి చెందిన యువత భారీగా తెలుగుదేశం పార్టీలో చేరారు. తెదేపా సీనియర్ నాయకులు పాలూరి బోసు బాబు ఆధ్వర్యంలో జగ్గంపేట లోని రావులమ్మ నగర్ లోని తెదేపా కార్యాలయంలోని మంగళవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిశారు. అనంతరం డ్రైవర్స్ కాలనీకి చెందిన యువ నాయకుడు మండే గౌతమ్ ఆధ్వర్యంలో భారీగా యువత తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరినీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెదేపా కండువాలు కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాగరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పరిపాలనపై నమ్మకంతో యువత స్వచ్ఛందంగా కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నారన్నారు.గోకవరం గ్రామం నుండి పెద్ద ఎత్తున యువత స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీలో చేరడం శుభపరిణామం అన్నారు. రాబోయే రోజుల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని, వారి భవిష్యత్తుకు ప్రభుత్వం మంచి భరోసా కల్పిస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. అనంతరం వీరంతా గోకవరం గ్రామ సర్పంచ్ అభ్యర్థి గాజింగం వల్లిదేవి సత్తిబాబును వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి తమ మద్దతును ప్రకటించారు. తెలుగుదేశం పార్టీలో చేరిన వారిలో మండే గౌతమ్, మండే వెంకటేష్, బొడ్డు శ్రీనివాస్, గేదెల కరుణ కుమార్, కొండపల్లి మధు కేశవ, షేక్ రహీం, చల్లా ప్రశాంత్, ప్రగడ సోమశేఖర్, చాపాని తాతాజీ, సోమ రౌతు రోహిణి శ్రీ సాయి, రాగాల బాబ్జి, బత్తిన వినోద్, రాగాల సాయి, దూనబోయిన పవన్, బండి అశోక్, శీలం వీరబాబు, పిల్లి అనిల్, ముదరకోలా శ్రీరామ్, రాజేష్, షేక్ అబ్బాస్, బచ్చు గోపాలకృష్ణ, మాదే నాని, సుందరం, బాగోతుల రాజేష్, పవన్ తదితరులు ఉన్నారు.. ఈ కార్యక్రమంలో గోకవరం మాజీ జెడ్పిటిసి పాలూరి బోస్ బాబు, జన సైనికులు మహిపాల పాండురాజు, పడాల చిన్న తదితరులు పాల్గొన్నారు...

సత్యదేవుని తెప్పోత్సవం ఏర్పాట్లు పరిశీలించిన పెద్దాపురం డిఎస్పీ తిలక్



అన్నవరం,న్యూస్100 : అన్నవరం సత్యదేవుని తెప్పోత్సవ కార్యక్రమం ఏర్పాట్లు మంగళవారం రాత్రి పెద్దాపురం డిఎస్పీ తిలక్ పరిశీలించారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ సూచనల మేరకు పెద్దాపురం సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్ ఏ బి జి తిలక్ మరియు ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సూర్య అప్పారావు పంపా వద్దకు విచ్చేసి హంసవాహన రూపకల్పన ఏర్పాట్లు పరిశీలనకు విచ్చేసినట్లు అన్నవరం పోలీసులు తెలిపారు .అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం నందు ఈనెల 21 తేదీన జరగబోవు తెప్పోత్సవానికి సంబంధించి ఎటువంటి అవాంఛనీయులు సంఘటనలు జరగకుండా ఉండేందుకు గాను ముందస్తు చర్యలలో భాగంగా డిఎస్పీ అన్నవరం పోలీసులకు తగు సూచనలు చేశారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, భద్రతా ఏర్పాట్లలో అప్రమత్తంగా ఉండాలన్నారు.సదరు తెప్పోత్సవానికి సంబంధించిన వివరాలను దేవస్థానం ఇంజనీరింగ్ ఈఈ రామకృష్ణను ఈసందర్భంగా డీఎస్పీ అడిగి తెలుసుకున్నారు. పంపాలో హంసవాహన పంటుపై మరో రెండు రోజులలో ట్రయల్ రన్ నిర్వహించి,వాహనం ఫిట్ నెస్ గమనించడం జరుగుతుందని, ఇప్పటికే తెప్పోత్సవం ఏర్పాట్లు చాలా వరకూ పూర్తయినట్లు ఈఈ రామకృష్ణ డిఎస్పీ తిలక్ కు వివరించారు.

అక్వాన్ తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆకస్మిక వరదలు సంభవించవచ్చని హెచ్చరించారు. గత నెల రోజుల వ్యవధిలో అర్నల్, మురసు తుపాన్లు రాష్ట్రాన్ని ప్రభావితం చేశాయని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. వాటితో పోలిస్తే అక్వాన్ తీవ్రత ఎక్కువగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత తుపాన్ల సమయంలో ప్రభుత్వం తీసుకున్న సమర్థమైన చర్యలతో ప్రాణనష్టం జరగకుండా నివారించగలిగామని చెప్పారు. అదే స్ఫూర్తితో ఈసారి కూడా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల ప్రాణరక్షణకు ప్రాధాన్యం రెడ్ అలర్ట్ ప్రకటించిన జిల్లాల్లో అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రంలో వేటకు వెళ్లకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా బీచ్‌ల వైపు వెళ్లకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల తుపాను గాలుల్లో చిక్కుకుని తమిళనాడు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయిన ఘటనను ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. రైతులకు అండగా నిలవాలి వరి పంట చేతికొచ్చే కీలక సమయంలో తుపాను ముప్పు ఏర్పడటం రైతులకు ఆందోళన కలిగిస్తోందని పవన్ కల్యాణ్ అన్నారు. పంట నష్టాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించేందుకు పంచాయతీరాజ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులకు సహకరించాలని సూచించారు.

ఇంజినీరింగ్ కనీస ఫీజు రూ.47 వేలకు పెంపు

వెల్లడించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు రూ.5 వేల కోట్ల బకాయిలను విడుదల చేసిందని తెలిపింది. ప్రస్తుతం ప్రతినెలా రూ.200 కోట్ల నుంచి రూ.250 కోట్ల వరకు నిధులు విడుదలవుతున్నాయని, ఈ మొత్తాన్ని నెలకు రూ.400 కోట్లకు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 202526 విద్యా సంవత్సరానికి సంబంధించి రూ.1,800 కోట్లకు ప్రొసీడింగ్స్ జారీ కాగా, ఇప్పటికే రూ.1,000 కోట్లు విడుదలయ్యాయని పేర్కొంది. మిగిలిన రూ.800 కోట్లను రానున్న రెండు మూడు నెలల్లో విడుదల చేసే అవకాశం ఉందని తెలిపింది. 202627 విద్యా సంవత్సరానికి సంబంధించిన నిధుల్లో కనీసం 50 శాతాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే విడుదల చేయాలని కోరినట్లు వెల్లడించింది. విద్యార్థుల ఖాతాల్లో నేరుగా ఎంటీఎఫ్ నిధులు జమ చేసే అంశంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని వివరించింది.

సజ్జల, పెద్దిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు
- సబ్‌జైలు వద్ద అలజడులు సృష్టించారని ఆరోపణ
- పోలీసులపై దాడికి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్

గుంటూరు, న్యూస్100 : జిల్లా సబ్‌జైలు వద్ద జరిగిన ఘటనకు సంబంధించి వైసీపీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ)కి ఫిర్యాదు చేశారు. జైలులో ఉన్న అప్పిరెడ్డిని పరామర్శించే పేరుతో వారు అక్కడ అలజడులు సృష్టించారని, ఈ క్రమంలో విధుల్లో ఉన్న పోలీసులు గాయపడటానికి కారణమైన వారిపై కేసులు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు. పోలీసులపై దాడి అమానుషం ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పనిచేసే పోలీసులపై దాడులకు పాల్పడటం అమానుషమైన చర్య అని టీడీపీ నాయకులు మండిపడ్డారు. పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా వైసీపీ నేతలు వ్యవహరించారని ఆరోపించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాధ్యులపై కేసులు నమోదు చేయాలి ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ.. జైలులో అప్పిరెడ్డిని పరామర్శించే పేరుతో వైసీపీ నాయకులు అలజడులు సృష్టించారని ఆరోపించారు. విధుల్లో ఉన్న పోలీసులపై వైసీపీ కార్యకర్తలు దాడులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. పోలీసులపై దాడి జరిగినప్పటికీ కేసు నమోదు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందని మాణిక్యరావు వ్యాఖ్యానించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి వైసీపీ నాయకులు పలు వివాదాలకు తెరతీస్తూ ప్రభుత్వంపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

జగన్‌ను కలిసిన మాజీ మంత్రి రోజా



అమరావతి, న్యూస్100 : వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ మంత్రి ఆర్కే రోజా మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం తన పుట్టినరోజు సందర్భంగా జగన్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను ఆమె తన సామాజిక మాధ్యమ ఖాతాలో అభిమానులతో పంచుకున్నారు. జగన్ ఆశీస్సులు తీసుకున్న రోజా పుట్టినరోజు సందర్భంగా తన ప్రియతమ నాయకుడు, అన్న వైఎస్ జగన్‌ను కలవడం ఎంతో ఆనందంగా ఉందని రోజా పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగన్‌ను 'సంక్షేమ సామ్రాట్'గా అభివర్ణించారు. ఎప్పటిలాగే ఆయన చూపించిన ప్రేమ, ఆప్యాయతలను పొందడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. పార్టీ సమావేశాల్లోనూ పాల్గొన్న రోజా జగన్‌ను కలిసిన అనంతరం పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశాల్లోనూ పాల్గొన్నట్లు రోజా తన సామాజిక మాధ్యమ పోస్టులో వెల్లడించారు. పుట్టినరోజు సందర్భంగా జగన్ ఆశీస్సులు తీసుకోవడం, పార్టీ నాయకులతో సమావేశాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగన్‌తో కలిసి దిగిన ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు.


న్యూస్100

బుధవారం నవంబర్ 18 , 2026

చినకొండేపూడిలో ఘనంగా కార్తీక ఏకాదశి దీపారాధన మహోత్సవం

సీతానగరం న్యూస్100: సీతానగరం మండలం చినకొండేపూడి గ్రామంలోని శ్రీ లక్ష్మీదేవి ఆలయంలో ఈ నెల 20వ తేదీ శుక్రవారం కార్తీక ఏకాదశి దీపారాధన మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ గ్రామాలకు చెందిన భజన బృందాలతో ప్రత్యేక భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మొత్తం ఎనిమిది విడతలుగా భజన కార్యక్రమాలు జరగనున్నాయి.





చినకొండేపూడి, రఘుదేవపురం, తదితర గ్రామాల భజన బృందాలు పాల్గొననున్నాయి. 21వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

వైసీపీకి కోలుకోలేని దెబ్బ...

- తెలుగుదేశంలో చేరిన 'మింది నాగేంద్ర'.
- 27వ వార్డు నుండి మింది మాధవీ పోటీ

రాజమహేంద్రవరం, న్యూస్100 : నియోజక వర్గంలో వైసిపికి మరో షాక్ తగిలింది. ఇప్పటికే వైసిపికి చెందిన పలువురు నాయకులు తమ అనుచరులతో తెలుగుదేశం పార్టీలో చేరిపోగా, తాజాగా మాజీ కార్పొరేటర్ మింది నాగేంద్ర తన అనుచరులతో తెలుగుదేశం తీర్థం తీసుకున్నారు. వైసిపి గ్రూపు రాజకీయాలకు విసుగుచెంది రాష్ట్ర అభివృద్ధికి తెలుగుదేశం నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, ముఖ్యంగా



రూరల్ నియోజక వర్గంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాల అమలును చూసి, తెలుగుదేశం సిద్ధాంతాలకు, పార్టీ క్రమశిక్షణకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు నాగేంద్ర ప్రకటించారు. దీంతో మున్సిపల్ కార్పొరేషన్ 27వ వార్డులో వైసిపికి కోలుకోలేనిదెబ్బ తగిలింది. ఆయన సతీమణి, మాజీ కార్పొరేటర్ మింది మాధవీ, డబ్బింగ్ రమేష్, హర్షవర్ధన్ స్కూల్స్ అధినేత దేశెట్టి హరిప్రసాద్ తదితరులు కూడా తెలుగుదేశంలో చేరడంతో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాగా 27వ వార్డు జనరల్ మహిళకు రిజర్వ్ కావడంతో మింది మాధవీ తెలుగుదేశం టికెట్ పై బరిలో దిగుతున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ యామన నారాయణ గౌడ్, కొంతమూరు గ్రామ పార్టీ అధ్యక్షులు పెన్నమరెడ్డి ఈశ్వరుడు, దళవ కోటి, నమ్మి శేఖర్, నరసింహుళ అంజి బాబు, మింది రాధా తదితరులు ఉన్నారు.

గోరంట్ల బుచ్చయ్య చౌదరిని కలిసిన బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి

- మర్యాదపూర్వక భేటీలో డాక్టర్ అరవింద్ సింగ్ భదౌరియా
- పలు రాజకీయ, పార్టీ వ్యవహారాలపై చర్చలు

రాజమహేంద్రవరం, న్యూస్100 : భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి (ప్రభారి), సీనియర్ నాయకుడు డాక్టర్ అరవింద్ సింగ్ భదౌరియా మంగళవారం రాజమహేంద్రవరంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. గోరంట్ల కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో ఇరువురు నేతలు పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కూటమి పార్టీల సమన్వయం, పార్టీ బలోపేతం తదితర అంశాలపై



చర్చించినట్లు తెలిసింది. ఈ సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర కూడా పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి పర్యటన నేపథ్యంలో ఈ భేటీ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

నామినేషన్ల కేంద్రాలు పరిశీలించిన సీఐ, ఎస్ఐ

జగ్గంపేట, న్యూస్100 : జగ్గంపేట మండలంలోని పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ కేంద్రాలను మంగళవారం జగ్గంపేట సీఐ బి.తిరుపతిరావు, ఎస్ఐ టి.రఘునాధరావు పరిశీలించారు. జగ్గంపేట పంచాయతీ కార్యాలయం, స్వర్ణ రామవరం-1 కార్యాలయం, స్వర్ణ రాజపూడి-2 కార్యాలయం, స్వర్ణ మల్లిశాల-2 కార్యాలయం, స్వర్ణ మామిడాడ కార్యాలయం, కాట్రావులపల్లి పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించి



సిబ్బందికి పలు సూచనలు చేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్, 30 సెక్షన్ అమలులో ఉంటుందని గుంపులుగా ఎవరూ తిరగరాదన్నారు. నామినేషన్లు వేసేందుకు అభ్యర్థితో పాటు ఇద్దరికే అనుమతి ఉంటుందన్నారు. ఎక్కడైనా గొడవలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభ్యర్థులంతా సహకరించి ప్రశాంతంగా నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు.

మిర్తిపాడు పరిధిలో బుధవారం ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

సీతానగరం,న్యూస్100: అక్వాన్ తుపాను నేపథ్యంలో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపు పనుల కారణంగా ఈ నెల 18వ తేదీ బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. 33/11 కేవీ మిర్తిపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని మిర్తిపాడు, హుండేశ్వరపురం, బొబ్బిలంక, ములకలంక, జాలిముడి, కాటవరం గ్రామాల్లో గృహ, వాణిజ్య, వ్యవసాయ, ఆక్వా విద్యుత్ వినియోగదారులకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్. శామ్యూల్ తెలిపారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని కోరారు.

పటవలలో కూటమి అభ్యర్థి కొటికలపూడి వెంకటలక్ష్మి విస్తృత ప్రచారం

- ప్రజల నుంచి విశేష స్పందన

తాళ్లరేవు, న్యూస్100: గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామాల్లో అభ్యర్థులు ప్రచారాలు ప్రారంభించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పటవల గ్రామపంచాయతీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న జనసేన పార్టీ నాయకుడు కొటికలపూడి ప్రసాద్ సతీమణి వెంకటలక్ష్మి మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని ఈబీసీ కాలనీలో పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. టిడిపి జనసేన బిజెపి నాయకులు, మహిళలతో కలసి ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయితీ సమస్యలు తెలిసిన వ్యక్తిగా ప్రజల మద్దతు కోరారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మద్దతుతో పోటీ చేస్తున్న తమకు ఓటు వేసి గెలిపించాలని వెంకటలక్ష్మి ప్రసాద్ కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో నాయకులు కొత్తూరు కాశి, బోనం శ్రీనివాసరావు, చెక్కా



అజయ్ వర్మ, భజన సత్తిబాబు, శివ గోవిందు అప్పారావు అధిక సంఖ్యలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

గాడిమొగలో కామాడి వాసు జోరుగా ప్రచారం

- హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

తాళ్లరేవు, న్యూస్100: మండల పరిధిలోని గాడిమొగ పంచాయతీలో కూటమి అభ్యర్థి కామాడి వాసుదేవరాజుకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మద్దతుతో టిడిపి నాయకుడైన కామాడి వాసుదేవరాజు కూటమి అభ్యర్థిగా బరిలో దిగారు. ఈ మేరకు ఆయన పంచాయతీ పరిధిలోని చినవలసల గ్రామంలో జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుడు సంగాడి కామేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. అభివృద్ధి సంక్షేమం కొనసాగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న కామాడి వాసుని గాడిమొగ సర్పంచ్ గా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో కూటమి నాయకులు కామాడి గంగరాజు, సంగాడి కామేశ్వరరావు, లంకె నూకరాజు, మల్లాడి ఈశ్వరరావు, కామాడి సూరిబాబు, మల్లాడి గోవరాజు, సంగాడి గోవరాజు, మల్లాడి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

72 ఏళ్ల వయసులోనూ విద్యాభ్యాసంలో అజేయుడు.. 105 డిగ్రీలతో అరుదైన రికార్డు!

- ఎన్‌పీటీఈఎల్‌లో వరుసగా ఐదోసారి మెగాస్టార్ గుర్తింపు
- 13 వారాల్లో 108 వారాల అధ్యయనం పూర్తి..
- 16 కోర్సుల్లో అద్భుత ప్రతిభ

రాజమహేంద్రవరం న్యూస్100 : వయసు అనేది కేవలం సంఖ్య మాత్రమేనని, నేర్చుకోవాలనే తపనకు వయోపరిమితులు ఉండవని డాక్టర్ కర్రి రామారెడ్డి నిరూపిస్తున్నారు. 72 ఏళ్ల వయసులోనూ నిత్య విద్యార్థిగా కొనసాగుతూ విద్యాభ్యాసంలో అరుదైన ఘనతలు సాధిస్తున్నారు. వైద్య వృత్తిలో కొనసాగుతూనే వివిధ రంగాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తూ ఇప్పటివరకు డాక్టరేట్లు, పీజీలు, డిగ్రీలు, డిప్లొమాలు, సర్టిఫికెట్ కోర్సులు కలిపి మొత్తం 105 విద్యార్హతలను సొంతం చేసుకున్నారు. తాజాగా మరోసారి ఎన్‌పీటీఈఎల్ లో మెగాస్టార్ గుర్తింపు సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. సైకియాట్రీ, సైకాలజీ, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, న్యాయశాస్త్రం, విద్య, ఆంగ్ల సాహిత్యం, లైబ్రరీ సైన్స్, యోగా థెరపీ, జర్నలిజం, కామర్స్, పొలిటికల్ సైన్స్ తదితర విభాగాల్లో ఆయన విద్యాభ్యాసం కొనసాగింది. ఈ విద్యార్హతలన్నీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి, స్వయంకృషితో సాధించినవే కావడం విశేషం. 2026 జూలైడిసెంబర్ సెమిస్టర్‌లో భాగంగా డాక్టర్ రామారెడ్డి ఏకంగా 16 ఎన్‌పీటీఈఎల్ కోర్సులను విజయవంతంగా పూర్తి చేశారు. సాధారణంగా 108 వారాలకు సరిపడే అధ్యయనాన్ని కేవలం 13 వారాల్లోనే పూర్తి చేయడం ఆయన పట్టుదలకు నిదర్శనం. వీటిలో తొమ్మిది కోర్సుల్లో టాపర్‌గా నిలవగా, ఎనిమిది కోర్సుల్లో ఎలైట్ ప్లస్ గోల్డ్, మరో ఎనిమిది కోర్సుల్లో ఎలైట్ ప్లస్ సిల్వర్ గ్రేడ్ సాధించారు. ఐఐటీ ఢిల్లీ, గువాహటి, రూర్కీ, ఖరగ్‌పూర్, మద్రాస్‌తో పాటు ఐఐఎస్‌సీ బెంగళూరుకు చెందిన కోర్సులను పూర్తి చేశారు.



కనీసం ఆరు కోర్సుల్లో టాపర్‌గా నిలిచిన వారికి అందించే అరుదైన మెగాస్టార్ గుర్తింపును ఆయన మరోసారి దక్కించుకున్నారు. దీంతో వరుసగా ఐదో సెమిస్టర్‌లోనూ మెగాస్టార్‌గా నిలిచి అరుదైన రికార్డు సృష్టించారు. ఈ కోర్సులకు సంబంధించిన పరీక్షలు రాజమహేంద్రవరంలోని శ్రీ హర్ష కుమార్ రాజీవ్ గాంధీ కళాశాల పరీక్షా కేంద్రంలో నిర్వహించారు. 72 ఏళ్ల వయసులోనూ ఇంతటి క్రమశిక్షణతో, పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఐఐటీలు, ఐఐఎస్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించే కఠినమైన ఆన్‌లైన్ కోర్సులు, పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడం ఆయన ప్రత్యేకతను చాటుతోంది. విద్య అనేది ఉద్యోగం లేదా ఒక వయసుకు మాత్రమే పరిమితం కాదని, నిరంతరం జ్ఞానాన్ని పెంపొందించుకోవాలనే తపన ఉంటే జీవితాంతం నేర్చుకోవచ్చని డాక్టర్ కర్రి రామారెడ్డి ప్రయాణం సమాజానికి చాటి చెబుతోంది. ఆయన సాధించిన 105 విద్యార్హతలు, వరుస మెగాస్టార్ గుర్తింపులు విద్యార్థులకు, యువతకు, విద్యాభిమానులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి.

అండ్రంగి సర్పంచ్ బరిలో కూటమి అభ్యర్థి కొప్పిశెట్టి లక్ష్మీనారాయణ

- గ్రామంతో అనుబంధం.. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించడమే లక్ష్యం
- మెరుగైన మౌలిక సదుపాయాలు.. పారదర్శక పాలనకు ప్రాధాన్యం

కాజులూరు న్యూస్100 : అండ్రంగి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల బరిలో కూటమి అభ్యర్థిగా కొప్పిశెట్టి లక్ష్మీనారాయణ నిలిచారు. కూటమి నాయకులు బొండా శ్రీను ,కొండేటి చక్రం ,కేసన రాజబాబు, పెద్దిరెడ్డి సూరిబాబు ,మట్ట రాజు ,కేసన నాగేశ్వరరావు, దాట్ల కొండబాబు ,రేలంగి విజయ్ కుమార్, ఎంపీటీసీ మాచవరపు వెంకటరాముడు, బండారు త్రిమూర్తులు ,కేశన బుజ్జి ,రాయుడు లోవరాజు ,చీకట్ల శ్రీనివాస్ ,గోవిందు, కోసెట్టి సోమరాజు ,సత్యంశెట్టి వీరబాబు ,బొండా స్వామీలు సంయుక్తంగాసమావేశమై లక్ష్మీనారాయణ ను సర్పంచ్ అభ్యర్థిగా నిర్ణయించారు. గ్రామస్తులతో సత్సంబంధాలు, కుటుంబ రాజకీయ అనుభవం, స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించిన నేపథ్యంతో ఆయన ఎన్నికల ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. లక్ష్మీనారాయణ తల్లి కొప్పిశెట్టి సత్యవతి 2006లో ఎంపీటీసీ సభ్యురాలిగా ఎన్నికై ప్రజాప్రతినిధిగా సేవలందించారు. తల్లి రాజకీయ అనుభవం, ప్రజలతో ఉన్న అనుబంధం తనకు స్ఫూర్తిగా నిలిచాయని లక్ష్మీనారాయణ పేర్కొంటున్నారు. కౌలు వ్యవసాయం చేస్తూ గ్రామీణ జీవన విధానంతో మమేకమైన ఆయన, మరోవైపు గ్రామంలో ఇళ్లకు సంబంధించిన ప్లంబింగ్, ఎలక్ట్రికల్ మరమ్మతుల పనులు చేస్తూ ప్రతి కుటుంబంతో పరిచయాలు పెంచుకున్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ గ్రామస్తులతో సత్సంబంధాలను ఏర్పరచు కున్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్‌చార్జిగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారు. గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం, అంతర్గత రహదారులు, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నదే తన ప్రధాన లక్ష్యమని లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే విధంగా గ్రామ పాలన



సాగిస్తానని వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని అభివృద్ధి పథంలో అండ్రంగి గ్రామాన్ని ముందుకు తీసుకెళ్లడమే తన ఆకాంక్ష అని, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తుల సహకారంతో మెరుగైన పాలన అందించేందుకు కృషి చేస్తానని కూటమి సర్పంచ్ అభ్యర్థి కొప్పిశెట్టి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

పెసా గ్రామసభ ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు ఎన్నికల్లో పోటీపై అనర్హత!

రంపచోడవరం న్యూస్100 : పెసా చట్టం కింద ఏర్పాటైన గ్రామసభల ఉపాధ్యక్షులు, కార్యదర్శులు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసేందుకు అర్హులు కారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ చట్టం 1994 సెక్షన్ 18(1) ప్రకారం ఈ అనర్హత వర్తిస్తుందని తెలిపారు. పోటీ చేయాలనుకునే పెసా గ్రామసభ కమిటీ సభ్యులు ముందుగానే తమ పదవులకు రాజీనామా చేసి, నామినేషన్ల పరిశీలనకు ముందే రాజీనామా ఆమోద ఉత్తర్వులను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని సూచించారు. నిబంధనలు పాటించని వారి నామినేషన్లు చెల్లుబాటు కావని కలెక్టర్ హెచ్చరించారు.




న్యూస్100

బుధవారం నవంబర్ 18 , 2026

దుగ్గుదూరు సర్పంచ్ బరిలో కూటమి అభ్యర్థిగా కురుపూడి గోవిందరాజు

- 15 ఏళ్లుగా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సేవలు.. మండల టీడీపీ అధ్యక్షుడిగా రాజకీయ అనుభవం
- 2013లో సర్పంచ్‌గా పోటీ చేసిన అనుభవం.. కూటమి నాయకుల ఏకగ్రీవ నిర్ణయం
- గ్రామ సమగ్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

కాజులూరు న్యూస్100 : దుగ్గుదూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. కూటమి తరఫున సర్పంచ్ అభ్యర్థిగా కురుపూడి గోవిందరాజును నాయకులు ఏకగ్రీవంగా ఎంపిక చేయడంతో గ్రామ రాజకీయాల్లో ఆయన అభ్యర్థిత్వంపై చర్చ ప్రారంభమైంది. సుదీర్ఘకాలంగా గ్రామస్థాయి రాజకీయాలు, పార్టీ వ్యవహారాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ వచ్చిన ఆయనకు వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం ఉండటం విశేషం. 15 ఏళ్లుగా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు కురుపూడి గోవిందరాజు గత 15 సంవత్సరాలుగా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ కాలంలో గ్రామానికి సంబంధించిన వివిధ సమస్యలు, ప్రజా అవసరాలు, రాజకీయ పరిణామాల్లో తనదైన పాత్ర పోషించారు. గ్రామస్థాయి నాయకత్వంతో పాటు పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగారు. యూనిటీ ఇన్‌చార్జిగా కూడా బాధ్యతలు నిర్వహించిన ఆయనకు క్షేత్రస్థాయిలో రాజకీయ వ్యవహారాలపై అవగాహన ఉంది. మండల టీడీపీ అధ్యక్షుడిగా రాజకీయ ప్రస్థానం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో ముఖ్యమైన అంశం. పార్టీ కార్యక్రమాలు, కార్యకర్తల సమన్వయం, గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు రాజకీయ కార్యకలాపాల్లో భాగస్వామిగా ఉన్నారు. 2013లో సర్పంచ్ పదవికి పోటీ చేసి ఓటమి ఎదుర్కొన్నప్పటికీ, రాజకీయాలకు దూరం కాకుండా తన కార్యకలాపాలను కొనసాగించారు. అప్పటి అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ఈసారి మరోసారి సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమయ్యారు. కూటమి నాయకుల ఏకాభిప్రాయంతో ఎంపిక గ్రామంలో కూటమి పార్టీల మధ్య సమన్వయం కొనసాగించే దిశగా నాయకులు కోప్పిశెట్టి స్వామి నాయుడు ,కాజులూరు డిసి లకాని కృష్ణ చైతన్య, ఎంపీటీసీ మేడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ (పెద్ద), దూడల శంకరనారాయణ , రంపాల రాజు ,పోతు జ్యోతి కుమార్ ,మాత స్వామి, మాత వెంకటరమణ , రాధా బాబు , రేమెళ్ళ సత్యంబాబు రేమెళ్ళ ప్రసాద్ రేమెళ్ళ శేషగిరి చర్చలు జరిపి కురుపూడి గోవిందరాజును సర్పంచ్ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకుల నిర్ణయంతో ఆయన అభ్యర్థిత్వం ఖరారైంది. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి



ప్రాధాన్యతనిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని ఆయన పేర్కొంటున్నారు. గ్రామ సమగ్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యం దుగ్గుదూరు గ్రామంలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని కురుపూడి గోవిందరాజు వెల్లడించారు. గ్రామంలోని ప్రతి ప్రాంతానికి అవసరమైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సదుపాయం, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయడంతో పాటు గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలు, యువత ఆకాంక్షలు, మహిళల సమస్యలు, రైతుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నదే తన ఆలోచనగా పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామ ప్రజలందరినీ కలుపుకొని దుగ్గుదూరును అభివృద్ధి పథంలో నడిపించడమే తన ముందున్న లక్ష్యమని కురుపూడి గోవిందరాజు వెల్లడించారు. సుదీర్ఘకాల రాజకీయ అనుభవం, గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు, గతంలో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసిన అనుభవంతో ఈసారి దుగ్గుదూరు పంచాయతీ ఎన్నికల్లో ఆయన అభ్యర్థిత్వం ప్రాధాన్యత సంతరించుకుంది.

రాచపల్లిలో ఉచిత వైద్య శిబిరం.. 200 మందికి వైద్య సేవలు

- అన్నవరం దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యుడు బుద్ధరాజు గోపిరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం
- శిబిరాన్ని ప్రారంభించిన మాజీ సర్పంచ్ బి సుబ్బరాజు
- ఉచితంగా మందులు పంపిణీ చేసిన గోపిరాజు

ఏలేశ్వరం/ప్రత్తిపాడు, న్యూస్100: ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామంలో అన్నవరం దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యుడు బుద్ధరాజు గోపిరాజు స్వగృహం వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ సర్పంచ్ బి సుబ్బరాజు శిబిరాన్ని ప్రారంభించారు. ప్రత్తిపాడులోని శ్రీ జై భవాని ఆసుపత్రి వైద్యులు ఆర్ ఆర్ పవన్ కుమార్, మౌనిక, పి అనంత్ సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం బుద్ధరాజు గోపిరాజు రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ



కార్యక్రమంలో ఎంపీటీసీలు కారే శ్రీరామచంద్ర, ఈగల మహాలక్ష్మి, గ్రామ పెద్దలు బుద్ధరాజు రామకృష్ణంరాజు, దంతులూరి రామకృష్ణ, సత్యనారాయణ, కారే రామకృష్ణ, డేగల అర్జుబాబు, నారిపెడ్డి చక్రి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో వైసీపీ సర్పంచ్ అభ్యర్థి సీతారామరాజుకు ప్రజల బ్రహ్మరథం

- ప్రచారంలో పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి ముదునూరి

ఏలేశ్వరం/ప్రత్తిపాడు, న్యూస్100: ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి ముద్రగడ గిరిబాబు బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు సోదరుడు ముదునూరి సీతారామరాజుకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ నేపథ్యంలో నవంబర్ 16న సీతారామరాజు తన సోదరుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, గ్రామ సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులతో కలిసి 7, 8 వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తనతో పాటు 7వ వార్డు అభ్యర్థి ఊబ రత్నశారా జెస్సీ భాయ్, 8వ వార్డు అభ్యర్థి అంబటి రాజు రాణిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

అడుగడుగునా హారతులు.. పూల వర్షం!

ప్రచారంలో భాగంగా సీతారామరాజు, మురళీకృష్ణం రాజుకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలకగా, పలుచోట్ల పూల వర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రజలు వారికీ బ్రహ్మరథం పట్టారు.



గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి కష్టసుఖాల్లో తోడుగా నిలిచి ధర్మవరం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని సీతారామ రాజు హామీ ఇస్తూ ప్రచారం కొనసాగించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల వేళ పోలీసుల అప్రమత్తం!

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు.. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

రంపచోడవరం న్యూస్100 : పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ కె.చక్రవర్తి పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నవంబర్ 17న పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎన్నికల భద్రతపై పలు కీలక సూచనలు చేశారు. రాజకీయ, వ్యక్తిగత కక్షల నేపథ్యంలో గొడవలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి బైండోవర్ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఎస్పీ ఆదేశాల్లో ముఖ్యాంశాలు:

- సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటు చేయాలి.
- గతంలో గొడవలకు పాల్పడిన వ్యక్తులు, రౌడీషీటర్ల కదలికలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి.
- బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేయాలి.
- అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించేందుకు తనిఖీలు నిర్వహించాలి.
- ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం, ఓటు హక్కును వినియోగించుకోకుండా అడ్డుకోవడంపై కఠినంగా వ్యవహరించాలి.
- కుల, మత, వర్గ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రచారాలను అడ్డుకోవాలి.
- సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే పోస్టులపై ప్రత్యేక నిఘా ఉంచాలి.
- ఎన్నికల నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పించి, శాంతియుత ఎన్నికలకు సహకరించేలా చర్యలు తీసుకోవాలి. ఎన్నికల ప్రక్రియలో ప్రజాస్వామ్య విలువలు కాపాడటమే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేయాలని ఎస్పీ సూచించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పించాలని అధికారులకు స్పష్టం చేశారు.



పిల్లల రక్షణ కోసమే రూపొందించబడిన చట్టం ఫోక్సో





అనపర్తి, న్యూస్100 : లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ కోసం రూపొందించబడిన చట్టమే ఫోక్సో అని అనపర్తి సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎం వంశీకృష్ణ అన్నారు. న్యాయ అవగాహన సదస్సులలో భాగంగా స్థానిక టి ఏ ఆర్ స్కూల్లో మంగళవారం ఫోక్సో చట్టంపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జడ్జి వంశీకృష్ణ విద్యార్థులతో మాట్లాడుతూ 18 సంవత్సరాల కంటే తక్కువ వయసు గల బాలురు బాలికలు ఈ చట్టాన్ని ఉపయోగించి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకువచ్చని అన్నారు. పిల్లలపై జరుగుతున్న అకృత్యాలను అడ్డుకోవడానికి ప్రభుత్వం సమగ్రమైన చట్టం ఫోక్సోను రూపొందించడం జరిగిందని, వికృత చేష్టలతో పిల్లల జీవించే హక్కును హరించిన వారిపై ఈ చట్టం కఠినంగా శిక్షిస్తుందని, అలాగే శారీరకంగా, మానసికంగా వేధించిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని కోర్టు జడ్జి వంశీకృష్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ కే శ్రీనివాస్ రెడ్డి, సెక్రటరీ టీవీ వి రమణమూర్తి, న్యాయవాదులు విను రెడ్డి, శ్యాం ప్రసాద్ రెడ్డి, స్కూలు కరస్పాండెంట్ టీ అప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో బాలల రక్షణ, హక్కులు, దత్తతపై అవగాహన సదస్సు

- సిడిపిఓ పద్మావతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం..
- ఆకట్టుకున్న చిన్నారుల ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు

ఏలేశ్వరం/ప్రత్తిపాడు, న్యూస్100: ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ధర్మవరం గ్రామంలో బాలల రక్షణ, హక్కులు, దత్తతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిడిపిఓ పద్మావతి మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. జాతీయ బాలల హక్కుల వారోత్సవాలు, జాతీయ బాలల దత్తత అవగాహన మాసోత్సవాల లక్ష్యాలను వివరించి, బాలల హక్కులు, రక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాల చిన్నారులు ప్రదర్శించిన ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జి చక్రవేణి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



యర్రవరంలో కూటమి అభ్యర్థి బస్సా త్రివేణి ప్రసాద్ ఎన్నికల ప్రచార జోరు

- కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా ఇంటింటా ప్రచారం

ఏలేశ్వరం, న్యూస్100: ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామంలో కూటమి పార్టీలు బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి బస్సా త్రివేణి ప్రసాద్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జనసేన సమన్వయకర్త మేడిశెట్టి బాబి, బీజేపీ నాయకుల ఆశీస్సులతో సర్పంచ్ బరిలో నిలిచిన ఆమె ఇంటింటా పర్యటిస్తూ ఓటర్లను కలుస్తున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే సత్యప్రభ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ గ్రామ సమగ్ర అభివృద్ధికి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ప్రచారంలో అడుగడుగునా మహిళలు స్వాగతం పలుకుతూ మంగళహారతులతో నీరాజనాలు అందిస్తున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, 10వ వార్డు అభ్యర్థి మైరాల కనకారావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ గంగిరెడ్ల గనిలక్ష్మి మణికంఠ, 11 వ వార్డు అభ్యర్థి ఆకుల నాని, తోట హరి, గ్రంధి రాజు తదితరులు పాల్గొన్నారు.



జి.వేమవరంలో సర్పంచ్ అభ్యర్థి పుణ్యమంతుల దుర్గాదేవి విస్తృత ప్రచారం



తాళ్ళరేవు, న్యూస్100: మండల పరిధిలోని జి.వేమవరం పంచాయితీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జనసేన పార్టీ నాయకుడు పుణ్యమంతుల సత్తిబాబు సతీమణి దుర్గాదేవి మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని మట్లపాలెం కాలనీలో స్థానిక నాయకులు, అభిమానులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు మాట్లాడుతూ తన ఐదేళ్ల పాలనలో ప్రజలకు మంచి సేవలు అందించానన్నారు. తనతోపాటు సత్తిబాబు కూడా నిరంతరం ప్రజాసేవలో అంకితమయ్యేవాడని తెలిపారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆశీస్సులతో సర్పంచ్ గా పోటీ చేస్తున్నామని దుర్గాదేవిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న జి.వేమవరం ప్రధాన రహదారిని అభివృద్ధి చేయడంతో పాటు అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పినపోతు రాజు, పినపోతు శ్రీనివాసు, అనుకూలి శ్రీనివాసరావు, కడియాల శ్రీరాములు, పుణ్యమంతుల సత్యనారాయణ, ఎర్రశీనీడి ఆంజనేయులు, గండి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్100

బుధవారం నవంబర్ 18 , 2026

పోషణ్ భీ.. పడాయి భీ కార్యక్రమం



గంగవరం న్యూస్100 : గంగవరం ఎం ఆర్ సి వద్ద పోషణ్ భీ పడాయి భీ ప్రోగ్రాం సీడీపీఓ. (ఎఫ్ ఏసి) కె. కుమారి గారి ఆధ్వర్యంలో జరిపించడ మైనది.ఆరోగ్యమే మహా భాగ్యం అనే పెద్దల మాట ప్రకారం పెద్దలకు, పిల్లలకు ఆహారం చాల అవసరం. పుట్టిన పిల్లవాడి కి 6 నెలలు తల్లి పాలు ఇస్తూ 7 వ నెల అన్నప్రాసన(అన్ని రకాల ఆహార పదార్థాలను కలిపి బిడ్డకు తినిపించే కార్యక్రమం) చేసి , 7 వ నెల,8 నెల,9 వ నెల వరకు ద్రవ , ఘనరూపంలోయూ బిడ్డకు ఆహారం ఇస్తూ తదుపరి ఆహార పరిమాణం పెంచుతూ ఉంటే వయస్సు కు తగిన ఎత్తు – బరువు పెరుగుతూ ఉంటారు. తగిన వయస్సు కు దశల వారీగా ఎదుగుదల ఉంటుంది, నవచేతన్ స్క్రీనింగ్ ద్వార పిల్లల్లో ఉన్న అంగవైకల్యం గుర్తుంచి తల్లిదండ్రుల కు వివరించి, మెరుగైన చికిత్స అందించే చూడడం, ముఖ్య ఉద్దేశ్యం ఎంపీడీఓ గారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న ఆహార పదార్థాల కోసం, నవచేతన్ స్క్రీనింగ్ పిల్లల ఆరోగ్య సమస్యలు,సంరక్షణ కోసం అడిగి తెలుసుకున్నారు ,ఎం ఈఓ గారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న విధ్య బోధనకు, కాన్వెంట్ విధ్య బోధనకు తేడాలు చెప్పి, ఓపెన్ స్కూల్ గంగవరం మండలం లో గంగవరం గ్రామంలోనే పెట్టియున్నాము, చదువు మానివేసిన మగ, ఆడ వారికి ఇది చాల ఉపయోగ పడుతుంది అని చే ప్పి యున్నారుఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా (మండల అధికారి)ఎంపీడీఓ గారు ఎ. లక్షణ రావు గారు, ఎం ఈఓ గారు ఎ. మల్లేశ్వరరావు గారు , డిప్యూటీ ఎంపీడీఓ గారు హాజరైనారు

కోలంక కూటమి సర్పంచ్ అభ్యర్థిగా బొండా వెంకన్న

- నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవంతో ఎన్నికల బరిలోకి..

- ఎంపీటీసీ సభ్యుడిగా, సహకార సంఘ అధ్యక్షుడిగా గతంలో సేవలు.. ప్రస్తుతం జనసేన మండల అధ్యక్షుడిగా బాధ్యతలు

రాజలూరు న్యూస్100 : కోలంక గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థిగా బొండా వెంకన్న పేరు తెరపైకి వచ్చింది. సుమారు 40 సంవత్సరాల రాజకీయ అనుభవం కలిగిన ఆయన గ్రామ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్నారు. వివిధ రాజకీయ, సహకార రంగాల్లో బాధ్యతలు నిర్వహించిన అనుభవంతో ఈసారి సర్పంచ్ ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. రాజకీయ ప్రస్థానంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందిన బొండా వెంకన్న, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావుకు ముఖ్య అనుచరుడిగా సుదీర్ఘకాలం పనిచేశారు. పార్టీ కార్యక్రమాలు, గ్రామస్థాయి రాజకీయ వ్యవహారాల్లో చురుకైన పాత్ర పోషించారు. రాజకీయంగా వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజా జీవితంలో కొనసాగుతున్నారు. గతంలో ఎంపీటీసీ సభ్యుడిగా ఎన్నికై స్థానిక సంస్థల పరిపాలనలో తన వంతు పాత్ర పోషించారు. అలాగే సహకార సంఘ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించి సహకార రంగంలోనూ తన సేవలను అందించారు. ప్రస్తుతం జనసేన పార్టీ మండల అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ పార్టీ కార్యకలాపాల్లో భాగస్వామిగా ఉన్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, స్థానిక సంస్థల్లో పనిచేసిన పరిచయం, వివిధ రాజకీయ నాయకులతో ఉన్న అనుబంధం ఆయన రాజకీయ ప్రస్థానంలో ప్రధాన అంశాలుగా నిలుస్తున్నాయి. వివాదాలకు దూరంగా ఉంటూ రాజకీయ వ్యవహారాల్లో కొనసాగుతున్న నాయకుడిగా ఆయన అనుచరులు అభివర్ణిస్తున్నారు. ఈ నేపథ్యంలో కోలంక గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా బొండా వెంకన్న పోటీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం, అంతర్గత రహదారులు, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయడం వంటి అంశాలు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కీలకంగా మారనున్నాయి. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవాన్ని గ్రామాభివృద్ధికి ఎలా వినియోగిస్తారన్నది ఇప్పుడు కోలంక గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. గతంలో



నిర్వహించిన పదవుల అనుభవం, ప్రస్తుత రాజకీయ బాధ్యతలు, గ్రామంతో ఉన్న అనుబంధం నేపథ్యంలో బొండా వెంకన్న అభ్యర్థిత్వం స్థానిక ఎన్నికల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

విజయవాడలో 'బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్' మానవతా దృక్పథం

తల్లిదండ్రులు లేని 20 మంది విద్యార్థులకు దుప్పట్లు, స్టేషనరీ పంపిణీ



విజయవాడ, న్యూస్100: అజిత్ సింగ్ నగర్‌లోని ఎంకే బేగ్ ఎంసీ హైస్కూల్‌లో 'బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్' సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సహాయ పంపిణీ కార్యక్రమం జరిగింది. 'స్పాన్సర్ ఏ చైల్డ్' ప్రోగ్రామ్‌లో భాగంగా సంస్థ దత్తత తీసుకున్న 20 మంది తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులకు అక్టోబర్ నెలకు సంబంధించిన వస్తువులను అందజేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు రూ.10,000 విలువగల దుప్పట్లు, పెన్నులు, స్కేళ్లు, పెన్సిల్స్ వంటి స్టేషనరీ వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎమ్ ఎం. హుస్సేన్, బిగ్ హెల్ప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అజ్మీరు ఆనందరావు, ఉపాధ్యాయులు మాధవి, కిషోర్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు. పేద విద్యార్థులను గుర్తించి ప్రతినెలా అవసరమైన సామగ్రిని అందిస్తున్న బిగ్ హెల్ప్ ఫౌండర్, చైర్మన్ షేక్ చాంద్ పాషాకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నవరం దేవస్థానం టెంపుల్ ఇన్స్పెక్టర్ బైక్ ఛోరీ

చెలరేగిపోతున్న బైక్ దొంగలు చోద్యం చూస్తున్న పోలీసులు



అన్నవరం,న్యూస్100 :అన్నవరం దేవస్థానం టెంపుల్ ఇన్స్పెక్టర్ బైక్ మంగళవారం రత్నగిరిపైనే ఛోరీకి గురైంది.ప్రతీరోజూలాగే బైక్ పై డ్యూటీకి వచ్చి ఆలయ తూర్పు రాజగోపురం ఎదురుగా గల రోడ్డునందు పార్క్ చేసానని, డ్యూటీ అనంతరం వెళ్ళి చూడగా తన గ్లామర్ బైక్ ఛోరీకి గురైనట్లు నిర్ధారణ అయిందని, సదరు బైక్ యజమాని వర్రే బాబూరావు తెలియజేసారు.దీంతో రత్నగిరిపై భద్రత ప్రశ్నార్థకమవుతుందని పలువురు భక్తులు అభిప్రాయపడుచున్నారు. బైక్ ఛోరీకి గురైన ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. రత్నగిరిపైకి భక్తులను తీసుకొచ్చే ఆటోలు, ఇతర వాహనాలు అక్కడే ఆగుతాయి. పలువురు అర్చకులు, వ్రతపురోహితుల వాహనాలు కూడా ఇక్కడే పార్కింగ్ చేస్తారు. అయినప్పటికీ పట్టపగలే బైక్ లు ఛోరీకి గురవడం గమనార్హం. అదువులో లేని నేరాలు అన్నవరంలో బైక్ దొంగతనాలు ఇటీవల రోజురోజుకి పెరుగుచున్నాయి. విలువైన కొత్త బైక్ లే టార్గెట్ గా చోరీలు జరుగుచున్నాయి. దొంగలు ముందుగా ఆయా ఏరియాలలో సంచరించి ఆప్రాంత స్థితిగతులు అంచనా వేసుకుని అందరూ నిద్రలోకి జారుకున్నాక అర్ధరాత్రి సమయాలలో బైక్ చోరీలకు పాల్పడుచున్నారు. లేటెస్ట్ గా కొన్న వాహనాలనే ఎంచుకుని మరీ కొట్టేస్తున్నారు.ఒక్క అన్నవరం గ్రామంలోనే ఇటీవల పదుల సంఖ్యలో బైక్ లు చోరీకి గురైయ్యాయి.వరుస దొంగతనాలు జరుగుచున్నా,ఫిర్యాదు చేయడానికి స్థానిక పోలీస్ స్టేషన్ కు వెళ్ళినప్పటికీ వారు పట్టించుకోవట్లేదని, జాగ్రత్తగా చూసుకుంటే ఎందుకు పోతాయని పోలీసులు నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని, ఫిర్యాదులు కూడా తీసుకోవట్లేదని వాహనాలు పోగుట్టుకున్నవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తా లేని నైట్ పెట్రోలింగ్ పోలీసులు ప్రతీరోజూ నైట్ పెట్రోలింగ్ నిర్వహించాలి. గతంలో రాత్రి వేళల్లో సైరన్ తో పోలీసు పెట్రోలింగ్ వాహనం గ్రామ వీధుల గూండా తిరిగేది. దీంతో చోరీలు నియంత్రణలో ఉండేవి. ప్రస్తుతం పోలీసులు శాంతిభద్రతలు గాలికొదిలే సారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.అన్నవరంలో పోలీస్ స్టేషన్ ఉందా... అన్నట్లుగా పరిస్థితి ఉందని వాహనాలు పోగొట్టుకున్న బాధితులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.

సత్యదేవుని నిత్యఅన్నదాన పథకానికి రూ. 1,01,116/- విరాళం



అన్నవరం,న్యూస్100 : అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్యఅన్నదాన పథకమునకు మంగళవారం దాత 1,01116/– రూపాయలు విరాళం అందజేశారు. తాడేపల్లిగూడెం కు చెందిన కొత్త సూర్య నాగ సార్ధక్ నందన్ దేవస్థానం ఏఈఓ బలువు సత్యశ్రీనివాస్ కు ఈవిరాళం అందజేశారు. దీనిపై వచ్చు వడ్డీతో ప్రతీ ఏటా నవంబర్ 27 తేదీన తమ పేరున అన్నదానం చేయాలని కోరారు. ఈసందర్భంగా ఏఈఓ బలువు సత్యశ్రీనివాస్ దాతలను అభినందించి, సత్యదేవుని ఫొటో, ప్రసాదం అందజేశారు

విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం



ఏలేశ్వరం, న్యూస్100: విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, సమాజంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి,వాటికి సృజనాత్మక పరిష్కారాలను కనుగొనే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని యర్రవరం ప్రధానోపాధ్యాయులు నాదేలి కన్నబాబు ఆకాంక్షించారు.ఈ లక్ష్యంతో యర్రవరం ప్రధానమంత్రి శ్రీ పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థులకు స్వయం ఉపాధి,నూతన ఆవిష్కరణలు, సృజనాత్మక ఆలోచనా విధానంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన ది ఆస్పైర్ కిడ్స్ వ్యవస్థాపకులు, అంతర్జాతీయ కార్మిక సంస్థ శిక్షకులు తరుణ్ కె.కరణం విద్యార్థులకు స్వయం ఉపాధి ప్రాధాన్యతను వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వయం ఉపాధి అంటే కేవలం వ్యాపారాలు ప్రారంభించి లాభాలు సంపాదించడం మాత్రమే కాదని, మన చుట్టూ ఉన్న సామాజిక సమస్యలను గుర్తించి, వినూత్న ఆలోచనలతో వాటికి పరిష్కారాలు చూపుతూ సమాజానికి మేలు చేయడమే నిజమైన స్వయం ఉపాధి స్ఫూర్తి అని పేర్కొన్నారు. ప్రతి సమస్యలోనూ ఒక అవకాశాన్ని గుర్తించగలిగినప్పుడే అభివృద్ధికి పునాది పడుతుందని తెలిపారు.విద్యార్థులు చిన్నతనం నుంచే సృజనాత్మకత, సమస్యల పరిష్కార నైపుణ్యం,నిర్ణయాత్మక శక్తి, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, ఐకమత్యంతో పనిచేసే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఇతరుల అవసరాలను అర్థం చేసుకోవడం, సమస్యను గుర్తించడం, కొత్త పరిష్కారాలను ఆలోచించడం, నమూనాలను రూపొందించడం, వాటిని పరీక్షించడం వంటి ఐదు దశల సృజనాత్మక ఆలోచనా విధానాన్ని వివరించారు.అమూల్, జైపూర్ ఫుట్, అరవింద్ కంటి ఆసుపత్రి వంటి విజయవంతమైన భారతీయ సంస్థల ఉదాహరణలను వివరిస్తూ, ప్రజల అవసరాలను గుర్తించి రూపొందించిన పరిష్కారాలు సమాజంలో ఎంతటి మార్పును తీసుకురాగలవో తెలియజేశారు.అనంతరం నిర్వహించిన ప్రాయోగిక కార్యక్రమంలో విద్యార్థులు పాఠశాలలో, గ్రామంలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటికి వినూత్న పరిష్కారాలను సూచించేలా ప్రోత్సహించారు.విద్యార్థులు బృందాలుగా ఏర్పడి తమ ఆలోచనలను పంచుకుంటూ, వాటిని చిన్న నమూనాల రూపంలో రూపొందించే విధానంపై చర్చించారు.ఈ సందర్భంగా తరుణ్ కె. కరణం మాట్లాడుతూ,విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా, సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు చూపించే వ్యక్తులుగా,భవిష్యత్తులో ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థిలోనూ ఒక ఆవిష్కర్త దాగి ఉన్నాడని, సరైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం లభిస్తే వారి ఆలోచనలు సమాజంలో సానుకూల మార్పునకు దోహదపడతాయని అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సమస్యలను చూసి వెనుకడుగు వేయకుండా, వాటికి పరిష్కారాలను అన్వేషించాలని, అవకాశాల కోసం ఎదురుచూడకుండా కొత్త అవకాశాలను సృష్టించుకోవాలని సందేశాన్ని అందించారు. విద్యార్థుల్లో స్వయం ఉపాధి భావన, ఆత్మనిర్భరత, నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించడం ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని మేల్కొలిపి, నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించిన తరుణ్ కె. కరణంను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాదేలి కన్నబాబు చిరు జ్ఞాపికతో ఘనంగా సత్కరించి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల వృత్తి విద్యా మార్గదర్శక సలహాదారు కరణం రవి,ఉపాధ్యాయులు జి.నాగరాజు,జి. సత్యనారాయణ,ఎ.శామ్యూల్ సన్,టి. వెంకటేష్,కె.శైలజ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 11న కార్మికుల వన సమారాధన



ఏలేశ్వరం, న్యూస్100: ఏలేశ్వరం ఇరిగేషన్ సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు అనుబంధ కార్మిక సంఘాల నాయకత్వంతో మంగళవారం సమావేశం జరిగింది.ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషు బాబ్జీ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ లక్ష్మీ దాస్ భవన్ (సిఐటియు కార్యాలయం) 1979లో ప్రారంభించడం జరిగిందని అయితే ఈ కార్యాలయం శిథిలా వ్యవస్థలో ఉండడంతో ఈ కార్యాలయాన్ని పునర్నిర్మించడం జరుగుతుందని వారన్నారు. కామ్రేడ్ లక్ష్మీ దాస్ కార్మికుల సమస్యలపై ఎనలేని పోరాటం చేశారని,ఏలేరు నిర్మాణ కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని అవిశ్రాంతంగా పోరాడి కార్మికులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇప్పించారని ఈ సంధర్భంగా గుర్తు చేశారు.ఆయన స్ఫూర్తితో ఏలేశ్వరం మండల కార్మిక సంఘాలను పటిష్టం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశం లోని డిసెంబర్ 11న సిఐటియు కార్యాలయం ప్రాంగణం వద్ద కార్మికుల వన భోజనాలు కార్యక్రమం ఏర్పాటు చేయాలని,అదే రోజు మండల సమావేశం వేసి సిఐటియు కార్యాలయం పునర్నిర్మాణం ఏర్పాట్లు పై నిర్ణయాలు చేయాలని కమిటీ నిర్ణయించడం జరిగింది.ఈ సమావేశం అనంతరం కామ్రేడ్.లక్ష్మీదాస్ భవన్(సిఐటియు కార్యాలయం)పేరుతో గల ఫ్లెక్స్ ని ఆ స్థలంలోని కట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగల ఈశ్వరరావు,ఇరిగేషన్ యూనియన్ నాయకులు యం.అంజయ్య, ఎం.నూకరాజు,అంగన్వాడీ నాయకులు కె.సునీత,కుమారి ,పి.ఏ.సి.ఎస్ నాయకులు రాజు ,వీఒఏలు నాయకులు సత్యవేణి, గనిలక్ష్మి,సిఐటియు నాయకులు పి.సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

చివరిరోజు 230 నామినేషన్లు దాఖలు 38 సర్పంచ్లకు 192 నామినేషన్లు దాఖలు

తాళ్లరేవు, న్యూస్100: పంచాయతీ ఎన్నికలలో పోటీకి సంబంధించి నామినేషన్ల ప్రక్రియ చివరి రోజైన మంగళవారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. ఉదయం నుంచి నామినేషన్లను దాఖలు చేసేందుకు అభ్యర్థులు పోటెత్తారు. ఒక్కరోజే 230 నామినేషన్లు దాఖలయ్యాయి. తాళ్లరేవు మండలంలో 17 పంచాయతీ స్థానాలు ఉండగా, మొత్తంగా 110 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి, ఎంపీడీఓ వి.స్పర్జన్ తెలిపారు. అదేవిధంగా 206 వార్డులకుగానూ 436 మంది వార్డులకు తమ నామినేషన్లను దాఖలు చేసారు. కాగా 18వ తేదీన నామినేషన్ల పరిశీలనా కార్యక్రమం జరుగనుంది. 19వ తేదీన అభ్యంతరాలను స్వీకరించి, 20న అభ్యంతరాలను పరిశీలించి 21వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ చేపట్టనున్నారు. నామినేషన్లకు చివరిరోజు కావడంతో సమయం ముగిసినప్పటికీ టోకెన్లు జారీచేసి నామినేషన్లను స్వీకరించారు.

Edited, Printed, Published and Owned by Jajula Sathibabu on behalf of Jajula Sathibabu, Printed at Rainbow Printers, D.No 6`84, Saibabapuntha road, Hukumpeta, Rajahmundry Rural and Published at D.No5`67, ? Anjaneyaswamy gudiveedhi, Rampayarrampalem,Gokavaram Mandal, East Godavari District. Editor Jajula Sathibabu. RNI No.APTEL/26/A5538, CellÑ 9440633397, Email : jajulasathibabu@gmail.com